సాక్షి
వనపర్తి

గురువారం । 24 । ఆగస్టు । 2023



గ్రంథాలయాలు కిటకిట

గ్రంథాలయాల్లో వసతులు సమకూరడంతో అభ్యర్థులు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు.

వివరాలు 10లో ▸



ప్రభుత్వ భూమికి ఎసరు

రాజోళి మండలం పచ్చర్లలో దళితుల అసైన్డ్ భూమిని ఓ ప్రజాప్రతినిధి విక్రయానికి పెట్టాడు.

వివరాలు 12లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.9 /23.1

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది. మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సెప్టెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్



పెబ్బేరు రూరల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం సెప్టెంబర్ 9వ తేదీన జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు అదనపు సివిల్ కోర్టు న్యాయమూర్తి వై.జానకి తెలిపారు. బుధవారం జిల్లా కోర్టు సమావేశ మందిరంలో కోర్టు పోలీసుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాజీమార్గంలోనే సమస్యలు పరిష్కరించుకోవాలని, జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'విధులను నిర్లక్ష్యం చేయొద్దు'



మదనాపురం: వైద్యసిబ్బంది విధులను నిర్లక్ష్యం చేయకుండా బాధ్యతాయుతంగా పని చేయాలని జిల్లా వైద్యాధికారి డా. రవిశంకర్ సూచించారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి కాన్పుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని.. విధులకు డుమ్మాలు కొడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం సీజనల్ వ్యాధులకు సంబంధించిన వాల్‌పోస్టర్లను సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డా. భవాని, డా. రతన్, డా. ముజాఫర్, సూపర్‌వైజర్ ప్రమీల, ఫార్మసిస్ట్ శిల్ప, సిబ్బంది విజయ్, సురేష్, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలే లక్ష్యం



మదనాపురం: గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉంటూ అప్రమత్తంగా ఉండాలని.. వర్షాకాలం కావడంతో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాలని అడిషనల్ కలెక్టర్ తిరుపతి రావు సూచించారు. బుధవారం మండలంలోని ద్వారకానగర్, గోవిందహళ్లి, నెల్విడి, నర్సింగాపురం, కొన్నూరులో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా గ్రామపంచాయతీల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, పారిశుద్ధ్య కార్మికుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగేళ్ల సర్వీస్ పూర్తయిన పంచాయతీ కార్యదర్శులను ప్రతిభ ఆధారంగా ప్రభుత్వం క్రమబద్ధీకరిస్తుందని.. బాధ్యతగా పనిచేయాలని సూచించారు. పారిశుద్ధ్య కార్మికులు మురుగు కాల్వల్లో దోమలు లేకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లాలని చెప్పారు. మిషన్ భగీరథ నీరు ఎక్కడ వృథా కాకుండా చూడాలన్నారు. బాధ్యతగా విధులు నిర్వర్తించాలని.. ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌కుమార్, ఫారెస్ట్ సెక్షన్ అధికారి ప్రశాంత్‌రెడ్డి, ఎంపీడీఓ నాగేంద్రం, ఎంపీఓ పుష్ప తదితరులు పాల్గొన్నారు.

హద్దులు చూపే వరకు పోరాటం : సీపీఎం

అమరచింత: పేదలకు పంపిణీ చేసిన ఇంటి పట్టాలకు హద్దులు చూపే వరకు గుడిసెల పోరాటం ఆగదని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ అన్నారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో దుంపాయికుంట లబ్ధిదారులతో తహసీల్దార్ కార్యాలయం ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 22 ఏళ్ల కిందట దుంపాయికుంటలో పేదలకు ఇంటి పట్టాలిచ్చిన ప్రభుత్వం నేటికీ హద్దులు చూపకపోవడం.. ఆ స్థలాల్లో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించేందుకు సిద్ధమవడం తగదన్నారు. ఏడాదిగా ఆందోళనలు నిర్వహిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని.. తీరు మారకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. త్వరితగతిన సర్వే నిర్వహించి లబ్ధిదారులకు న్యాయం చేస్తామని తహసీల్దార్ చాంద్‌పాషా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకుడు మహమూద్, మండల కార్యదర్శి, మున్సిపల్ వైస్ చైర్మన్ జీఎస్ గోపి, ఆర్ఎన్ రమేష్, వెంకటేష్, అజయ్, బుచ్చన్న, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

జయహో చంద్రయాన్

- చంద్రుడిపై విక్రమ్ ల్యాండింగ్‌ను ఉత్కంఠగా తిలకించిన జనం
- యూనివర్సిటీ, కళాశాల, పాఠశాలలు, గురుకులాల్లో ప్రత్యేక ఏర్పాట్లు
- ఎల్ఈడీ స్క్రీన్లు, ప్రొజెక్టర్లపై తిలకించిన విద్యార్థులు
- జిల్లావ్యాప్తంగా సంబరాలు, ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు



అందాల జాబిల్లిపై భారతీయ కీర్తి రెపరెపలాడింది. అంతరిక్ష చరిత్రలో ఓ గొప్ప మైలురాయిని చేరుకొంది. చంద్రయాన్-3 కోట్లాది మంది మనసులను పులకింపజేసింది. దేశం మొత్తం ఎంతో ఉత్కంఠగా ఎదురు చూసిన చందమామపై విక్రమ్ ల్యాండింగ్‌ను జిల్లావాసులు ప్రత్యక్ష ప్రసారంలో తిలకించారు. ఇందుకోసం పలు విద్యాసంస్థల్లో పెద్దపెద్ద ఎల్ఈడీ స్క్రీన్లు, ప్రొజెక్టర్ల ద్వారా విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, అధికారులు తిలకించారు. చంద్రయాన్ ప్రయోగంలో చివరి 10 నిమిషాల పాటు అందరూ ఆసక్తిగా తిలకించారు. ప్రయోగం విజయవంతం అనంతరం సంబరాలు చేసుకున్నారు. జాతీయ జెండాను చేతబట్టుకొని వేడుకలు నిర్వహించారు. కేక్‌లు కట్ చేయడంతో పాటు స్వీట్లు పంచుకున్నారు. 140 కోట్ల మంది భారతీయుల ఆశలను మోసుకెళ్లిన చంద్రయాన్-3ని విజయవంతం చేసిన ఇస్రో శాస్త్రవేత్తలను అభినందించారు. ఇలా అందరం కలిసి ఇలాంటి దేశం గర్వించదగ్గ ప్రయోగాలను ప్రత్యక్షప్రసారాల ద్వారా చూడడం కొత్త అనుభూతిని ఇచ్చిందని విద్యార్థులు పేర్కొన్నారు.

– మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్ / ఆత్మకూర్



గోపాల్‌పేట మండలం బుద్దారం గురుకుల పాఠశాలలో టీవీలో లైవ్ చూస్తున్న విద్యార్థులు



చంద్రయాన్-3 విజయవంతం చారిత్రాత్మకం : కలెక్టర్

వనపర్తి: చంద్రయాన్-3 విజయవంతం చారిత్రాత్మక ఘట్టమని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. బుధవారం రాత్రి కలెక్టరేట్‌లో సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చంద్రయాన్-3 విజయోత్సవాల్లో ఆయన పాల్గొని కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





ఆత్మకూర్ మండలం మూలమళ్లలో సంబరాలు జరుపుకొంటున్న యువత

గర్వంగా ఉంది..



చంద్రయాన్-3 శాస్త్రవేత్తల జ్ఞానం, భారతదేశ గౌరవాన్ని మోసుకెళ్లింది. చంద్రుడిపై విజయవంతంగా దిగడంతో చాలా గర్వంగా ఉంది. ప్రపంచ దేశాల ముందు భారత్ గర్వంగా తలెత్తుకునేలా చేసిన ఇస్రో శాస్త్రవేత్తలకు యావత్ దేశం రుణపడి ఉంటుంది. చంద్రయాన్-3 చంద్రుడిపై దిగుతున్న సన్నివేశం టీవీలో చూసి చాలా సంతోషపడ్డా. ఇస్రో శాస్త్రవేత్తలు మున్ముందు మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నా.

– కేఎస్ రత్నం, సీఐ, ఆత్మకూర్

పెన్సిల్‌పై చంద్రయాన్ రాకెట్



చంద్రయాన్-3 విజయవంతమైన సందర్భంగా జడ్చర్లకు చెందిన స్వర్ణకారుడు సంతుచారి తన సూక్ష్మ కళను ప్రదర్శించి అర గంటలో పెన్సిల్‌పై చంద్రయాన్-3 రాకెట్‌ను తయారు చేశాడు.

– జడ్చర్ల టౌన్

చంద్రయాన్ బృందంలో తుమ్మన్‌పేట వాసి



బల్మూర్: నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం తుమ్మన్‌పేటకు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ లంగిశెట్టి రవికుమార్ చంద్రయాన్-3 ప్రయోగంలో భాగస్వామిగా ఉన్నారు. గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ మల్లయ్య కుమారుడు రవికుమార్ స్థానికంగానే ఏడో తరగతి వరకు చదువుకున్నారు. ఆ తర్వాత వేర్వేరు ప్రాంతాల్లో విద్యాభ్యాసం చేశారు. పదేళ్ల క్రితం తండ్రి మృతి చెందిన తర్వాత రవికుమార్ కుటుంబం బెంగళూర్‌లో స్థిరపడింది. కాగా.. దేశం గర్వించదగ్గ విజయంలో తమ ప్రాంత వ్యక్తి తనవంతు పాత్ర పోషించడంతో నల్లమల వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ఇస్రో శాస్త్రవేత్తల బృందంలో రవికుమార్

దేశం గర్వించదగ్గ రోజు



చంద్రయాన్-3 సక్సెస్ దేశం గర్వించదగ్గ రోజుగా చరిత్రలో నిలిచిపోతుంది. ఇస్రో శాస్త్రవేత్తల కృషి ఫలితంగా.. చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన తొలి దేశంగా భారత్ చరిత్ర సృష్టించింది. భారతీయులుగా మనందరం గర్వపడేలా చేసిన ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు. భవిష్యత్‌లో ఇస్రో మరిన్ని విజయాలు సాధించాలి.

– శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి

అద్భుత ఘట్టం



చంద్రయాన్-3 విజయవంతం దేశ చరిత్రలో అద్భుత ఘట్టం. శాస్త్ర సాంకేతిక రంగంలో భారత్ ప్రపంచ దేశాలకు ఏ మాత్రం తీసిపోని విధంగా ఎన్నో ప్రయోగాలు చేస్తుంది. యావత్ భారత్‌ను గర్వించేలా చేసిన ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు.

– సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి

మొదటి దేశం భారత్



చంద్రుడి దక్షిణ ధ్రువంపై మొదటిసారి ల్యాండర్‌ను దింపిన ఘనత భారత్‌కే దక్కుతుంది. తక్కువ ఖర్చుతో ప్రపంచ దేశాలను తలదన్నే విధంగా భారత్ ప్రయోగం ఎంతో గర్వకారణంగా నిలుస్తుంది. భవిష్యత్ ప్రయోగాలకు ఇది ఎంతో ఉపయోగకరం. భవిష్యత్ తరాలకు దిక్సూచి.

– చంద్రకిరణ్, పీయూ ప్రిన్సిపాల్

చారిత్రక ఘట్టం..



ఇస్రో శాస్త్రవేత్తలు పంపిన చంద్రయాన్-3 చంద్రుడిపై సురక్షితంగా దిగి జాతీయ జెండా రెపరెపలాడిన చారిత్రక ఘట్టం చూసి యావత్ దేశం మురిసిపోయింది. మన శాస్త్రవేత్తలు భవిష్యత్‌లో మరిన్ని ప్రయోగాలు విజయవంతంగా చేస్తారన్న భరోసా కలిగింది. ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు.

– గాయత్రి, పుర చైర్‌పర్సన్, ఆత్మకూర్

సంతోషంతో ఉప్పొంగిపోయా..



ఇస్రో శాస్త్రవేత్తలు ప్రయోగం ఫలించి చంద్రయాన్-3 విక్రమ్ విజయవంతంగా చంద్రుడిపై దిగిన వేళ సంతోషంతో ఉప్పొంగిపోయా. భారత్ ఎందులోనూ తీసిపోదని శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మన శాస్త్రవేత్తల జేజేలు భారతీయుల్ని గర్వించే స్థాయికి తీసుకెళ్లాయి.

–నరేందర్, ఎస్ఐ, ఆత్మకూర్

మూడోసారి అధికారం బీఆర్ఎస్‌దే..



ఆర్అండ్‌బీ ఎస్ఈ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి: రానున్న సాధారణ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అఖండ విజయం సాధించి రాష్ట్రంలో మూడోసారి పాలనా పగ్గాలు చేపడుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఆర్అండ్‌బీ ఎస్ఈ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ పరిపాలన దక్షత, ముందుచూపుతో రాష్ట్రంలో 33 జిల్లాలు ఏర్పాటుచేసి ప్రతి జిల్లాకు 50 నుంచి 55 జిల్లాస్థాయి కార్యాలయాలు ప్రారంభించారన్నారు. వనపర్తి జిల్లాలో ప్రారంభించిన ఆర్అండ్‌బీ ఎస్ఈ కార్యాలయం నుంచే నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల కార్యకలాపాలు కొనసాగుతాయని తెలిపారు. కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, ఆర్అండ్‌బీ ఎస్ఈ ఎం.నర్సింగం, మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, ఈఈ దేశ్యానాయక్, డీఈఈ దానయ్య పాల్గొన్నారు.

పని గుర్తించే వేతనాల పెంపు

అంగన్‌వాడి ఉపాధ్యాయులు, ఆయాల పనిని గుర్తించే రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు పెంచిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన అంగన్‌వాడీల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కేసీఆర్ నాయకత్వంలోనే సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రంలోని నాలుగున్నర కోట్ల జనాభాలో 9.60 లక్షల మంది ఉద్యోగులు ప్రజల ఆకాంక్ష మేరకు పని చేస్తున్నారని తెలిపారు. మిషన్ భగీరథ పథకంతో ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీరు అందుతోందన్నారు. కోట్లాది మందికి మీ చేతుల మీదుగా నిత్యం పౌష్టికాహారం అందుతుందని.. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ..

బుధవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో 187 మందికి రూ.61 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం 19 మందికి కారుణ్య నియామక పత్రాలు అందజేశారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు

చిన్నంబావి: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించి కేంద్రంలో, రాష్ట్రంలో ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తుందని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగసభలో మాట్లాడారు. ధనిక రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. స్వరాష్ట్ర సాధనకు ఉమ్మడి రాష్ట్రంలో మంత్రి పదవిని త్యాగం చేసి ఉద్యమిస్తే నేడు కుటుంబ పాలనతో స్వరాష్ట్రంలో కూడా ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఏర్పడిందని తెలిపారు. ప్రజలకు మాయమాటలు చెప్పి ఈ ఎన్నికల్లో కూడా విజయం సాధించాలని సీఎం కేసీఆర్ అనుకుంటున్నారని.. వారి పాలనకు చరమగీతం పాడాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం ఎన్నికల కోసమే దళితబంధు, రుణమాఫీ, గృహలక్ష్మి వంటి పథకాలు తీసుకొచ్చారని.. గతంలో దళితులకు మూడు ఎకరాల భూ పంపిణీ, డబుల్ బెడ్‌రూం ఇళ్లు వంటి పథకాలు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. పోలీసులను అడ్డం పెట్టుకొని నియోజకవర్గంలో అరాచక పాలన కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియాగాంధీకి కానుకగా ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు రాజేందర్‌ప్రసాద్ యాదవ్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు శ్రీలతారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామచంద్రారెడ్డి, కళ్యాణ్‌రావు, కృష్ణప్రసాద్‌యాదవ్, ఎన్ఆర్ఐ కొత్త కళ్యాణ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు

తప్పుల్లేని ఓటరు జాబితా రూపొందించాలి

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



హెచ్‌ఎంల శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న కలెక్టర్

వనపర్తి: తప్పుల్లేని ఓటరు జాబితా రూపొందించాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సూచించారు. బుధవారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో వనపర్తి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, బీఎల్వోలు, సూపర్‌వైజర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఓటు హక్కును వినియోగించుకోవటంతోనే స్వేచ్ఛ హక్కులు పొందగలుగుతున్నామన్నారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో అవసరమైన మార్పులు చేర్పులు చేయటానికి సూచించిన ఫారం-7, 8లో దరఖాస్తులు తీసుకొని వాటిని పరిశీలించి సరిగా నమోదు చేయాలన్నారు. పేర్లు తప్పుగా నమోదైతే ఇబ్బందులు కలుగుతాయని.. సరిగా చేయాలని సూచించారు. ఆగస్టు 26, 27.. సెప్టెంబర్ 2, 3 తేదీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ కేంద్రాల్లో బీఎల్వోలు దరఖాస్తులు తీసుకొని ఆర్డీఓలకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఓటరు శాతం పెంచేందుకు జూనియర్, డిగ్రీ కళాశాలల్లో అర్హులను గుర్తించి ఓటరు నమోదు చేయించాల్సిన బాధ్యత బీఎల్వోలపై ఉందన్నారు. గోపాల్‌పేట మండలం పోలికెపాడుకు చెందిన కొందరి ఓట్లు తాడిపర్తి పోలింగ్ స్టేషన్లో నమోదయ్యాయని.. వాటిని సరిచేయాలని సూచించారు. ఆర్డీఓ ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రతి మండలంలో సమీక్ష నిర్వహించి సరిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎస్.తిరుపతిరావు, ఆర్డీఓ పద్మావతి, ఎన్నికల సూపరింటెండెంట్ రమేష్‌రెడ్డి, నియోజకవర్గ పరిధిలోని తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయాలి..

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేలా ఉపాధ్యాయులు బోధన కొనసాగించాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఉన్నతి, లక్ష్యాలపై కొనసాగుతున్న ప్రధానోపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 6 నుంచి 9వ తరగతి వరకు చదివే విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఉన్నతి అనే కార్యక్రమం, 10వ తరగతి విద్యార్థులకు లక్ష్యా అనే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా బోధనలో మార్పులు రావాలన్నారు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న పరిణామాలు, మార్పులను ఉదహరిస్తూ విద్యాభ్యాసం జరగాలని.. అప్పుడే మేధాశక్తి పెరుగుతుందని వివరించారు. శిక్షణను సద్వినియోగం చేసుకొని విద్యార్థుల్లో గుణాత్మక విద్యను పెంచేలా కృషి చేయాలన్నారు.

స్పాట్ అడ్మిషన్లు

కొత్తకోట: పట్టణ సమీపంలోని ఎస్సీ గురుకుల బాలుర జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 25న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఉదయం 9 గంటల వరకు కళాశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎంపీసీలో ఎస్సీ విద్యార్థులకు 18, బైపీసీలో 11, బీసీ విద్యార్థులకు బైపీసీలో 4, ఎంపీసీలో 3, ఎస్టీ విద్యార్థులకు బైపీసీలో 2, ఎంపీసీలో 1, బైపీసీలో ఎస్సీ-సి విద్యార్థులకు 1, ఎంపీసీలో 1, ఓసీ విద్యార్థులకు బైపీసీలో 1, ఎంపీసీలో 1, మైనార్టీ విద్యార్థులకు బైపీసీలో 1, ఎంపీసీలో ఒక సీట్లు ఉన్నట్టు వివరించారు.

క్లుప్తంగా

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు

బాలానగర్: మండలంలోని పెద్దాయపల్లి గ్రామ శివారులోని జాతీయ రహదారిపై బుధవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా.. మరో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యాడు. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తమిళనాడు రాష్ట్రం ధర్మపురి జిల్లా ఆజటోప గ్రామానికి చెందిన డీసీఎం డ్రైవర్ మురుగన్(43) బుధవారం బెంగళూరు వైపు నుంచి హైదరాబాద్ వైపుగా డీసీఎం నడుపుకొంటూ వెళ్తున్నాడు. రోడ్డు మరమ్మతుల కారణంగా వన్ వేలో ముందుగా వెళ్తున్న కారు సడన్ బ్రేక్ వేయగా.. ఆ వెనుకాల ఉన్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు బ్రేక్ వేశారు. అదుపుతప్పి డీసీఎం డ్రైవర్ ట్రావెల్ బస్సును ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. ఆస్పత్రికి తరలించగా మృతిచెందాడు. ఈ సంఘటనలో వాహనాలు పాక్షికంగా దెబ్బతినగా.. ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు.

రోడ్డు దాటుతుండగా ఇద్దరికి గాయాలు...
బాలానగర్ మండల పరిధిలోని పెద్దాయపల్లి గ్రామం ముఖ్యకూడలి వద్ద ద్విచక్రవాహనంపై రోడ్డు దాటుతున్న కృష్ణ, సహదేవ్‌ను పెట్రోల్ ట్యాంకర్ వాహనం ఢీకొట్టడంతో కృష్ణ తలకు తీవ్ర గాయాలు కాగా.. సహదేవ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో షాద్‌నగర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే కృష్ణ పరిస్థితి విషమంగా ఉండటంతో ఉస్మానియా ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నట్లు గ్రామస్తులు తెలియజేశారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

పెబ్బేరు రూరల్: మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. శ్రీరంగాపురం మండలంలోని కంబళాపురం చెందిన బాలకృష్ణ (24) ఐదేళ్ల క్రితం నాగరాల చెందిన రేణుకతో వివాహమైంది. వీరికి కుమారుడు ఉన్నాడు. భార్యాభర్తలకు మనస్పార్థాలు వచ్చి నాలుగేళ్లుగా విడిగా ఉన్నారు. దీంతో ఆయన తాగుడుకు బానిసయ్యాడు. భార్య కాపురానికి పిలిచినా రాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది 7వ తేదీన కంచిరావుపల్లి సమీపంలో గడ్డి మందు తాగి తల్లికి ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే తల్లి, బావమరిది వెళ్లి చూడగా అపస్మారస్థితిలో ఉన్నాడు. అతన్ని మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో 16న హైదరాబాద్ తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటస్వామి తెలిపారు.

యువకుడి బలవన్మరణం

జడ్చర్ల: మానసికస్థితి బాగోలేక యువకుడు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన పట్టణ శివారులోని బోయలకుంట సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం ఇప్పలపల్లికి చెందిన తేడి ధర్మారెడ్డి(25) తండ్రి నారాయణరెడ్డి మరణం తర్వాత తీవ్ర మనస్తాపం చెందాడు. కొంతకాలంగా స్థానిక సిగ్నల్‌గడ్డ ప్రాంతంలో అద్దె ఇంట్లో తల్లి మంజులతో కలిసి నివాసం ఉంటున్నాడు. పోలేపల్లి సెజ్‌లోని ఫార్మా పరిశ్రమలో పనిచేస్తుండేవాడు. అయితే మానసికస్థితి బాగాలేకపోవడంతో చికిత్స తీసుకుంటున్నాడు. మంగళవారం రాత్రి మాత్రలు వేసుకోకుండా మొబైల్‌ఫోన్ కూడా ఇంట్లో పెట్టి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుమారుడు రాక కోసం ఇంటి వద్ద తల్లి ఎదురు చూసి తెలిసిన వారిని అడిగినా సమాచారం లేదు. బయటకు వెళ్లిన ధర్మారెడ్డి బోయలకుంట సమీపంలో గల ఓ వెంచర్‌లో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం వాట్సాప్ గ్రూపులో వచ్చిన ఫొటోను గుర్తించిన తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాలుడిని చంపిన కేసులో..

- నిందితురాలికి జీవిత ఖైదు

నారాయణపేట రూరల్: బాలుడిని చంపిన కేసులో నిందితురాలికి బుధవారం న్యాయమూర్తి యావజ్జీవ కారాగార శిక్ష విధించినట్లు ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని బండగొండకు చెందిన గొర్రెల కాపరి బోకులింటి నీలప్ప పదేళ్ల కిందట దామరగిద్ద మండలం సజనాపూర్‌కు చెందిన వసంతను పెళ్లి చేసుకున్నాడు. మూడేళ్లు గడిచినా పిల్లలు కాలేదని అదే మండలంలోని బాపన్‌పల్లికి చెందిన నాగమ్మ అలియాస్ అనితను వివాహం చేసుకున్నాడు. ఇద్దరు భార్యలతో కలిసి ఒకే ఇంట్లో ఉండేవారు. అదే ఏడాది మొదటి భార్యకు చరణ్ అలియాస్ చంద్రకాంత్ (5) జన్మించాడు. మూడేళ్ల తర్వాత రెండో భార్యకు అమ్మాయి జన్మించింది. ఈర్షతో రెండోభార్య 2021, నవంబర్ 22 సాయంత్రం 3 గంటల ప్రాంతంలో చరణ్‌ను గ్రామశివారులోని అవుసలోనికుంట చెరువుకు తీసుకెళ్లి వీపునకు రాయి కట్టి చెరువులోకి తోసేసి ఏమీ తెలియనట్లు ఇంటికి వచ్చింది. బాబు కనిపించడం లేదని కుటుంబ సభ్యులు వెదుకుతుండగా.. ఈమె ప్రవర్తనపై అనుమానం వచ్చి నిలదీయడంతో పాటు కొట్టగా నిజం చెప్పేసింది. వెంటనే చెరువు దగ్గరకు వెళ్లి మృతదేహం బయటకు తీసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. నాటి ఎస్ఐ సురేష్‌గౌడ్ కేసు నమోదు చేసి సీఐ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో దర్యాప్తు చేసి కోర్టుకు పంపించారు. బుధవారం కోర్టులో 13 మంది సాక్షుల వాదనలు విన్న ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ నిందితురాలికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. కేసు విచారణలో పాల్గొన్న పోలీసులను ఎస్పీ అభినందించారు.

గ్రంథాలయాలు కిటకిట

- పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు
- ఉదయం 6 నుంచి 11 గంటల వరకు..
- కోయిల్‌కొండ, హన్వాడలో కొత్త భవనాల నిర్మాణం


రాంనగర్ గ్రంథాలయంలో చదువుకుంటున్న అభ్యర్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: గతంలో గ్రంథాలయాలు అంటే కేవలం దిన పత్రికలు, వార, పక్ష సంచికలు, నవలలు మాత్రమే అందుబాటులో ఉండేవి. కానీ ప్రస్తుతం పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు వేదికగా మారాయి. రాష్ట్ర ప్రభుత్వం వివిధ ఉద్యోగ ప్రకటనలు జారీ చేసిన నేపథ్యంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు గ్రంథాలయాలకు వస్తున్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ జిల్లావ్యాప్తంగా ఉన్న పలు లైబ్రరీల్లో పూర్తిస్థాయిలో వసతులు సమకూర్చడంతో ఉమ్మడి జిల్లా అభ్యర్థులు అక్కడే పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. జిల్లాలోని ఐదు గ్రంథాలయాల్లో స్టడీ రూంలు ఏర్పాటు చేశారు. అభ్యర్థుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండటంతో లైబ్రరీల్లోని స్టడీ హాల్స్‌తో పాటు పేపర్ సెక్షన్, బుక్స్ సెక్షన్, ఇతర హాళ్లు మొత్తం కూడా వారికే కేటాయించినా కూడా సరిపోవడం లేదని అధికారులు చెబుతున్నారు.


స్టడీహాల్‌లో నిండిపోవడంతో బయట వరండాలో..

కొత్త భవనాల నిర్మాణం..
జిల్లాకేంద్రంలోని రాంనగర్‌తో పాటు దేవరకద్ర, జడ్చర్లలో కొత్త భవనాలు నిర్మించి అందుబాటులోకి తీసుకొచ్చారు. తాజాగా కోయిల్‌కొండలో రూ.60 లక్షలతో నిర్మించేందుకు శంకుస్థాపన చేయగా.. హన్వాడలో సైతం రూ.68 లక్షలతో భవన నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తికాగా.. శంకుస్థాపన చేయనున్నారు. వీటితో పాటు రాజాపూర్, మూసాపేట, చిన్నచింతకుంటలో కొత్త భవనాలు నిర్మించనున్నారు.

ఉదయం ఆరు నుంచే..
గ్రంథాలయాలు సాధారణంగా ఉదయం 10 నుంచి సాయంత్రం 6 వరకు మాత్రమే తెరుస్తారు. కానీ అభ్యర్థుల సౌకర్యార్థం ఉదయం 6 నుంచి రాత్రి 11 వరకు తెరిచి ఉంచుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. రోజు 800 మందికిపైగా అభ్యర్థులు గ్రంథాలయాలకు వస్తుండటంతో.. ప్రతి అభ్యర్థికి స్టడీ చైర్, ప్యాడ్, కావాల్సిన పుస్తకాలు, మంత్లీ ఎడిషన్‌లు సకాలంలో అందుబాటులో ఉంచుతున్నారు. తాగునీరు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు కల్పిస్తున్నారు.

అన్ని వసతులు కల్పిస్తున్నాం..



గతంలో కేంద్ర గ్రంథాలయంలో మాత్రమే పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అవకాశం ఉండేది. ప్రస్తుతం 5 గ్రంథాలయాల్లో విద్యార్థులకు సరిపడా పుస్తకాలతో పాటు కుర్చీలు, ప్యాడ్‌లు తదితర సౌకర్యాలు కల్పించాం. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సహకారంతో కొత్త భవనాలు నిర్మిస్తున్నాం. గతంలో ఎన్నడూ లేనివిధంగా గ్రంథాలయాలు అభివృద్ధి దిశగా పరుగెడుతున్నాయి.

– రాజేశ్వర్‌గౌడ్, చైర్మన్, జిల్లా గ్రంథాలయ సంస్థ

చైర్మన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.



గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులపై చైర్మన్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. వారంలో ఒకసారి వచ్చి వసతులు తెలుసుకొని, అవసరమైన వాటిని వెంటనే సమకూరుస్తున్నారు. రోజు గ్రామం నుంచి గ్రంథాలయానికి వచ్చి చదువుకుంటున్నాను.

– లీలావతి, అభ్యర్థి, జమిస్తాపూర్

అన్ని వసతులు కల్పిస్తున్నారు...



లైబ్రరీలో అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారు. అవసరమైన పుస్తకాలు, మంత్లి ఎడిషన్లు అడిగిన వెంటనే అందుబాటులో ఉంచుతున్నారు. ఎంతమంది వచ్చినా సరిపడా స్టడీ చైర్లు, ప్యాడ్‌లు సమకూరుస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తెరిచి ఉంచడంతో ఎక్కువ సమయం చదువుకొనే అవకాశం లభిస్తుంది.

– రంజిత్, అభ్యర్థి, రాంనగర్

సమయం కలిసివస్తుంది..



ప్రైవేటు స్టడీసెంటర్లు కేవలం 8 గంటలు మాత్రమే తెరిచి ఉంచుతారు. కానీ ఇక్కడ ఉదయం 6 నుంచి రాత్రి 11 వరకు తెరిచి ఉంచడంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సన్నద్ధమయ్యేందుకు అవకాశం ఉంది. కొన్నినెలలుగా ప్రిపరేషన్ సాఫీగా సాగుతోంది. లైబ్రరీలో అన్ని వసతులు కల్పిస్తున్నారు.

– కిషోర్‌కుమార్, ఏఈఈ అభ్యర్థి, దేవరకద్ర

బీఆర్‌ఆర్ కళాశాలలో ఎమ్మెస్సీ వృక్షశాస్త్రం

జడ్చర్ల టౌన్: స్థానిక డా. బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎమ్మెస్సీ వృక్షశాస్త్రం ప్రారంభమైందని.. ప్రవేశాలకు వెబ్‌ఆప్షన్లు నమోదు చేసుకోవాలని ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం కోరింది. నాలుగేళ్ల క్రితం వరకు పీజీ కోర్సులు కొనసాగినా.. పలు కారణాలతో నిలిపివేశారు. తిరిగి గతేడాది ఎమ్మెస్సీ వృక్షశాస్త్రం ప్రారంభించినప్పటికీ అడ్మిషన్ల ప్రక్రియ తుది దశకు చేరుకోవటంతో కేవలం ఐదుగురు విద్యార్థులు మాత్రమే ప్రవేశం పొందారు. దీంతో వారిని మహబూబ్‌నగర్ ఎంవీఎస్ కళాశాలకు పంపించారు. సీపీజీఈటీ–2023లో ఉత్తీర్ణులైన విద్యార్థులు తమ కళాశాలను ఎంపిక చేసుకోవాలని ప్రిన్సిపాల్ అప్పియా చిన్నమ్మ, వృక్షశాస్త్ర విభాగం అధిపతి శ్రీనివాసులు, అధ్యాపకుడు సదాశివయ్య కోరారు. కళాశాలలో ప్రయోగ శాలలు, అంతర్జాతీయ గుర్తింపు పొందిన తెలంగాణ రాష్ట్ర హెర్బేరియం, జీవ వైవిధ్య పరిశోధన విద్యాకేంద్రం, బొటానికల్ గార్డెన్ అందుబాటులో ఉన్నాయని.. వెబ్ ఆప్షన్‌లో బీఆర్‌ఆర్ కళాశాలకు ప్రథమ స్థానం ఇవ్వాలని కోరారు.


బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల

విద్యార్థిని బలవన్మరణం


శ్రావణి (ఫైల్)

కొత్తకోట: పట్టణానికి చెందిన ఓ విద్యార్థిని హైదరాబాద్‌లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కుమ్మరి గోపాల్ కుమార్తె శ్రీవాణి (19) హైదరాబాద్ మేడ్చల్‌లోని సూర్యనగర్‌కాలనీలో ఉన్న ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటూ సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదివేది. ఇటీవల ఇంటికి వచ్చి రెండ్రోజులు ఉండి సోమవారం తిరిగి హాస్టల్‌కు వెళ్లింది. బుధవారం మధ్యాహ్నం హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. కళాశాల నుంచి తండ్రికి ఫోన్ రావడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తూ హైదరాబాద్‌కు బయలుదేరారు. మూడు నెలల కిందట శ్రావణి అక్క వివాహం జరిగింది. అనంతరం శ్రావణి తల్లి పెబ్బేరు నుంచి కొత్తకోటకు బైక్‌పై వస్తుండగా నాటవెళ్లి సమీపంలో జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు బైక్ పైనుంచి పడి అక్కడికక్కడే మృతిచెందింది. మూడు నెలల వ్యవధిలో ఒకే కుటుంబంలో ఇద్దరు మృతిచెందడంతో కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కంట్లో కారం చల్లి బంగారు నగలు చోరీ

పెబ్బేరు రూరల్: మండలంలోని గుమ్మడం శివారులో వ్యవసాయ భూమి దగ్గర ఉన్న మహిళ కంట్లో కారం చల్లి బంగారు నగలు చోరీ చేసిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ జగదీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. వీపనగండ్ల మండలం గోవర్ధనగిరికి చెందిన రాజేశ్వరి గుమ్మడం శివారులోని తమ వ్యవసాయ భూమిలో గేదెలు మేపడానికి తీసుకెళ్లింది. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి కంట్లో కారం చల్లి మూడు తులాల బంగారం గొలుసు తీసుకెళ్లాడు. ఈ ఘటనపై పెబ్బేర్ పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మాధారంలో చోరీ

ఊర్కొండ: మండలంలోని మాధారంలో బుధవారం ఓ ఇంట్లో నగదు, ఆభరణాలు చోరీకి గురైనట్లు ఎస్ఐ లెనిన్ తెలిపారు. గ్రామానికి చెందిన అంకూరి దుర్గ సోమవారం బీఈడీ పరీక్ష రాసే నిమిత్తం తన ఇద్దరు పిల్లలను తీసుకుని నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి వెళ్లింది. పరీక్షలు ముగిసిన తర్వాత బుధవారం ఇంటికి వచ్చి చూసే సరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. ఇంట్లోని బీరువాను చూడగా రూ.50వేల నగదు, రూ.30వేలు విలువ చేసే బంగారు నగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పత్తిలో రసం పీల్చే పురుగులు.. నివారణ చర్యలు

- వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తే అధిక దిగుబడి
- సకాలంలో గుర్తించి మందులు పిచికారీ చేస్తేనే ప్రయోజనం


పత్తిలో బొట్టుపెట్టు పద్ధతిన మందు అందిస్తున్న రైతులు(ఫైల్)

కోస్గి: అదను, పదును చూసి వ్యవసాయం చేస్తేనే ఆశించిన స్థాయిలో పంటల దిగుబడి సాధించవచ్చునని, పంటల విషయంలో వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని నారాయణపేట జిల్లా వ్యవసాయశాఖ అధికారి జాన్ సుధాకర్ సూచిస్తున్నారు. గతంలో పత్తిపంటలో కాయ తొలుచు పురుగుల ఉధృతి ఎక్కువగా ఉండేదని, ప్రస్తుతం వాటి ఉధృతి తగ్గి రసం పీల్చే పురుగు అధికమై రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. రసం పీల్చే పురుగుల నివారణకు సకాలంలో వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు మందులు వాడటం ద్వారా నివారించవచ్చునని వివరించారు.

అధికారి సలహా
– జాన్ సుధాకర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, నారాయణపేట

పేనుబంక..
ఈ పురుగులు పంటను 20–25 రోజుల వయస్సులో ఆశించి రసం పీల్చి పంటను నష్టం చేస్తాయి. ఆకులు పసుపు రంగులోకి మారి ముడుచుకుపోతాయి. పురుగుల ఉధృతి బెట్ట పరిస్థితుల్లో ఎక్కువవుతుంది. ఆకాశం మేఘావృతమైనప్పుడు ఈ పురుగుల ఉధృతి మరింత ఎక్కువవుతుంది.

తామర పురుగులు..
ఈ పురుగులు సైతం పంటను 20–25 రోజుల వయసు నుంచి వివిధ దశలలో ఆశించి రసం పీల్చి నష్టపరుస్తాయి. దీనివల్ల ఆకు రంగు మారిపోయి మెరుస్తూ కనబడతాయి. ఆకులు ముడుచుకుపోతాయి. ఈ పురుగుల ఉధృతి కూడా బెట్ట పరిస్థితుల్లో ఎక్కువగా ఉంటుంది.

పచ్చదోమ..
ఈ పురుగులు పంటను 25–30 రోజుల వయసు నుంచి వివిధ దశల్లో ఆశించి రసం పీల్చి పంటను నష్టపరుస్తాయి. దీనివల్ల ఆకులు ఎరుపు రంగులోకి మారిపోతాయి. ఉధృతి తీవ్రమైనప్పుడు ఆకులు ముడుచుకుపోతాయి.

తెల్లదోమ..
ఈ పురుగులు పంటను 25–30 రోజుల వయసు నుంచి వివిధ దశల్లో ఆశిస్తాయి. రసం పీల్చడం వల్ల ఆకులు పసుపు రంగులోకి మారిపోతాయి. పురుగు ఉధృతి బెట్ట పరిస్థితుల్లోనే ఎక్కువగా ఉంటుంది.

నివారణ చర్యలు..
కిలో విత్తనాలకు తగినంత జిగురు కలిపి 5 గ్రాముల ఇమిడాక్లోరైడ్ 70 డబ్ల్యూఎస్ లేదా 4 గ్రాముల డయోమిథాక్సిమ్‌తో విత్తన శుద్ధి చేసి విత్తుకోవాలి. దీని వల్ల 30–40 రోజుల వరకు రసం పీల్చే పురుగులను నివారించవచ్చు.

కాండము పూత పూసే పద్ధతి
ఈ పద్ధతిలో మోనోక్రోటోఫాస్, నీరు 1:4 నిష్పత్తిలో లేదా ఇమిడాక్లోరైడ్ 200 ఎస్ఎల్, నీరు 1:20 నిష్పత్తిలో కలిపిన ద్రావణం విత్తిన 20, 40, 60 రోజుల్లో లేత కాండానికి పూయడం వల్ల రసం పీల్చే పురుగులు అదుపులో ఉంటాయి.

ప్రత్యేక సూచనలు...
- ఇమిడాక్లోరైడ్‌తో విత్తనశుద్ధి చేసిన విత్తనాలను విత్తడానికి ముందు ఎట్టి పరిస్థితుల్లోనూ నానబెట్టరాదు.
- రసం పీల్చే పురుగుల నివారణకు తొలి దశలో ఎక్కువసార్లు పురుగు మందు పిచికారీ చేయరాదు.
- తెల్లదోమ ఉధృతి ఎక్కువగా ఉంటే పసుపు రంగు డబ్బాలకు జిగురుపూసి ఉంచితే తెల్లదోమలు ఆకర్షించబడి జిగురుకు అంటుకుంటాయి.
- తెల్లదోమ ఆశించినప్పుడు పైరిత్రాయిడ్ మందుల వాడకాన్ని నిలిపివేయాలి.

అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం పట్టివేత

అమ్రాబాద్: పదర మండలంలోని మద్దిమడుగు రహదారిపై బుధవారం తెలవారుజామున రూట్ వాచ్ నిర్వహించిన ఎక్సైజ్ అధికారులకు 50 బస్తాల నల్లబెల్లం పట్టుబడింది. ఎక్సైజ్ ఎస్ఐ బాల్‌రాజు తెలిపిన ప్రకారం వివరాలిలా.. రూట్ వాచ్ నిర్వహిస్తున్న అధికారులకు గూడ్స్ వాహనం తనిఖీ చేసి పదర మండలం వంకేశ్వరం చెందిన పద్మ ఫర్టిలైజర్ దుకాణ యజమాని సత్యనారాయణగౌడ్, రవి, మరో ముగ్గురు ఉండగా వారిని విచారించారు. చెన్నంపల్లికి సారా తయారికి నల్లబెల్లం తరలిస్తున్నట్లు వారు చెప్పినట్లు ఎస్ఐ తెలిపారు. బెల్లం స్వాధీనం చేసుకుని నలుగురిపై కేసు నమోదు చేసి పదర తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.

పోలీసులపై దాడి చేసిన వ్యక్తి రిమాండ్

శాంతినగర్: బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతున్న వ్యక్తిపై ఈపిట్టి కేసు నమోదు చేస్తుండగా.. పోలీసులపైనే దాడికి పాల్పడిన యువకుడిని రిమాండ్‌కు తరలించిన సంఘటన శాంతినగర్‌లో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ నడిబొడ్డులోని హోసన్నా మందిర్ సమీపంలోని ఖాళీ స్థలంలో జిల్లెడుదిన్నెకు చెందిన కురువ జగదీష్ మంగళవారం మద్యం తాగుతున్నాడు. దీంతో బ్లూ కోర్టు విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు అయ్యన్న, గోకారిలు ఈ పిట్టి కేసు వేయడానికి ప్రయత్నించారు. విధుల్లోని కానిస్టేబుళ్లను ఇష్టం వచ్చినట్లు బూతులు తిట్టడమే గాక కాలర్ పట్టుకుని లాగి, రాళ్లతో దాడి చేసి విధులకు ఆటంకపరిచాడు. ఈ విషయమై బ్లూకోర్టు కానిస్టేబుల్ అయ్యన్న మంగళవారం ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశారు. బుధవారం జ్యుడీషియల్ రిమాండ్ కోసం అలంపూర్ కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు తెలియజేశారు.

కేసు నమోదు..

కోస్గి: చికిత్స పొందుతున్న శిశువు మృతిచెందిన ఘటనపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన కథనం మేరకు.. మద్దూర్ మండలం పల్లెగడ్డతండాకు చెందిన ప్రియాంక కాన్పు కోసం ఈ నెల 11న కోస్గిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చింది. బిడ్డకు ప్రాణాపాయం ఉందని చెప్పినప్పటికీ ప్రాధేయపడటంతో బాధితుల సమ్మతి మేరకు ఆస్పత్రి నిర్వాహకులు సిజేరియన్ చేశారు. శిశువు పరిస్థితి విషమంగా ఉండటంతో అదేరోజు పాలమూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి.. 15వ తేదీన హైదరాబాద్ నిలోఫర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 23వ తేదీన బాలుడు మృతిచెందాడు. బాధితుల ఫిర్యాదు మేరకు ఆస్పత్రి యాజమాన్యంపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

తీవ్ర రక్తస్రావంతో బాలింత మృతి


అచ్చంపేటలో ధర్నా చేస్తున్న వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

- వైద్యుడి నిర్లక్ష్యం వల్లే అని బంధువుల ఆరోపణ
- ఆపరేషన్ చేసిన డాక్టర్‌పై సస్పెన్షన్ వేటు


రోజా (ఫైల్)

అచ్చంపేట: వైద్యుడి నిర్లక్ష్యంతో బాలింత మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో చోటు చేసుకుంది. దర్శన్‌గడ్డ తండాకు చెందిన రోజా (27) మూడో కాన్పు కోసం ఈ నెల 15న స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా.. అదే రోజు ఆపరేషన్ చేశారు. ఈ నెల 21న ఆమెను ఇంటికి తీసుకెళ్లారు. అయితే 22వ తేదీన ఆమెకు తీవ్ర రక్తస్రావం కావడంతో వైద్యం చేసిన డాక్టర్ కృష్ణను సంప్రదించగా.. పట్టణంలోని తన ప్రైవేట్ క్లినిక్‌కు తీసుకు రమ్మని సూచించడంతో అక్కడికి తీసుకెళ్లారు. మంగళవారం రాత్రి పరిస్థితి విషమంగా ఉందని చెప్పిన సదరు డాక్టర్ హైదరాబాద్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడి నుంచి వెల్దండలో మరో ఆస్పత్రిలో చేర్పించినా.. రక్తస్రావం ఆగకపోవడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లేందుకు బయలుదేరారు. మార్గమధ్యంలోనే మహిళ మృతి చెందింది. ఆపరేషన్ చేసి కడుపులో దూది మర్చిపోవడం వల్లే ఇలా జరిగిందని, వైద్యుడి నిర్లక్ష్యం వల్లే రోజా చనిపోయిందని కుటుంబసభ్యులు, బంధువులు ఆరోపించారు. బుధవారం ఉదయం ప్రైవేట్ ఆస్పత్రి వద్దకు వచ్చి ఫర్నీచర్, అద్దాలు ధ్వంసం చేశారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో మృతదేహంతో రాస్తారోకో నిర్వహించారు.

విచారణ చేపట్టిన కమిషనర్..
అచ్చంపేటలో మహిళ మృతి సంఘటనలో వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్ ఆస్పత్రిలో విచారణ చేపట్టారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు తెలిపారు. పేదల జీవితాలతో చెలగాటమాడే వారిపై చర్యలు తీసుకునేంత వరకు వదిలేది లేదని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా వైద్యశాఖ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు.

డాక్టర్‌పై వేటు..
కడుపులో ఎలాంటి దూది లేదని పోస్టుమార్టం రిపోర్ట్‌లో తేలిందని వైద్యులు తెలిపారు. అయితే ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం చేస్తూ.. రోగిని తన ప్రైవేట్ క్లినిక్‌కు రెఫర్ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఉన్నతాధికారులు సదరు డాక్టర్ కృష్ణను సస్పెన్షన్ వేటు వేశారు.

కేసు నమోదు..
వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తన భార్య మృతి చెందిందని ఆరోపిస్తూ రోజా భర్త టీక్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అచ్చంపేట ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు.

పచ్చని కుటుంబంపై విధి కన్నెర్ర

- రోడ్డు ప్రమాదంలో తమ్ముడు.. అనారోగ్యంతో అన్న మృతి
- ఒకే కుటుంబంలో అన్నదమ్ముల మృతితో జడ్చర్లలో విషాదం


గంగారం శేఖర్ (ఫైల్)


గంగారం రవి (ఫైల్)

జడ్చర్ల టౌన్: పచ్చని కుటుంబంపై విధి కన్నెర్ర జేసింది. అన్నదమ్ములు ఇద్దరు భార్య, పిల్లలతో ఆనందంగా గడుపుతుండగా.. రోడ్డు ప్రమాదం రూపంలో తమ్ముడిని మృత్యువు కబళించగా, అనారోగ్యం కారణంగా అన్న మృతి చెందాడు. అన్నదమ్ములు ఇద్దరు మృతిచెందడంతో ఆ కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. జడ్చర్ల మున్సిపాలిటీలోని వెంకటేశ్వరకాలనీలో ఈ ఘటన చోటుచేసుకోగా.. పూర్తి వివరాలిలా.. గంగారం శేఖర్ (38), గంగారం రవి (32) ఇద్దరు అన్నదమ్ములు. మున్సిపాలిటీలో కార్మికులుగా పనిచేస్తున్నారు. అయితే, అన్న శేఖర్ కొంతకాలంగా అనారోగ్యానికి గురికావటంతో ఇంట్లోనే ఉంటున్నాడు. ఇతనికి భార్య ఉంది. అలాగే, తమ్ముడు రవికి భార్య సరిత, కూతురు ఉంది.

కూతురిని తీసుకెళ్లేందుకు వెళ్లి మృత్యుఒడికి..
ఈ క్రమంలో రవి సోమవారం ఉదయం చిట్టిబోయిన్‌పల్లి వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదువుతున్న కూతురును బోనాల పండగకు తీసుకువచ్చేందుకు ఇంటి నుంచి బైక్‌పై బయలుదేరి వెళ్లాడు. ఉదయమే కావడంతో వాచ్‌మెన్ హాస్టల్ లోపలికి అనుమతించలేదు. మళ్లీ రావాలని చెప్పటంతో అక్కడి నుంచి భూత్పూర్ వైపు వెళ్లాడు. ఈ క్రమంలోనే ప్రమాదవశాత్తు దివిటిపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రవి మృతి చెందాడు. అతని వివరాలు ఏవీ తెలియకపోవడంతో పోలీసులు గుర్తు తెలియని మృతదేహంగా జిల్లా ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చారు. ఈ క్రమంలో అతడు ఇంటికి రాకపోయేసరికి కుటుంబసభ్యులు వెతకటం ఆరంభించారు. ప్రమాద విషయం తెలుసుకుని మార్చురీలో ఉన్న మృతదేహాన్ని కుటుంబసభ్యులు గుర్తించారు. దీంతో బుధవారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

అనారోగ్యంతో అన్న..
ఇదిలా ఉండగా, శేఖర్ అనారోగ్యంతో ఇంట్లోనే ఉంటుండగా బుధవారం తెల్లవారుజామున ఒక్కసారిగా ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఇరువురి అంత్యక్రియలు బుధవారం సాయంత్రం జడ్చర్లలో నిర్వహించారు. ఒకే కుటుంబంలో ఇద్దరు మృతి చెందటం, అంత్యక్రియలు నిర్వహించాల్సి రావటంతో ఆ కుటుంబ సభ్యుల్లో తీరని విషాదం అలుముకొంది.

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు.. ముగ్గురికి గాయాలు

కొత్తకోట: ఆగిఉన్న బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ముగ్గురికి గాయాలైన ఘటన బుధవారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దమందడి మండలం బుగ్గపల్లితండాకు చెందిన సేవ్యానాయక్, మల్లేష్, అనిల్ బైక్‌పై కొత్తకోటకు వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా కానాయపల్లి స్టేజీ సమీపంలో సేవ్యానాయక్‌కు ఫోన్ రావడంతో బైక్‌ను పక్కకు ఆపి మాట్లాడుతున్నాడు. కొత్తకోట నుంచి వనపర్తికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఆగి ఉన్న బైక్‌ను ఢీకొనడంతో పక్కనే ఉన్న ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108లో వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ జనరల్ ఇంటర్మీడియట్, ఒకేషనల్ ఇంటర్మీడియట్ అన్ని సబ్జెక్ట్‌లు T.S ద్వారా ప్రచురించబడుతాయి ప్రచురణకర్తలు రేడియంట్ పబ్లిషర్స్ ద్వారా ప్రచురించబడిన పాలిటెక్నిక్ పుస్తకాలు గరిష్ట తగ్గింపు ధరపై అక్షర పుస్తకాల విస్తరణలో లభిస్తుంది. న్యూటౌన్, మహబూబ్‌నగర్. సంప్రదించవలసిన నెంబర్లు: 9246572697, 7207636194, 9246572622, 9676869638.

SERVICES

■ శ్రీ రామ్ గోల్డ్ మీ బంగారం తాకట్టులో ఉందా? వడ్డీ చెల్లించ లేకపోతున్నారా? తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ :9133214214

WANTED

■ మీ మొబైల్ ద్వారా మా కంపెనీ అడ్వర్టైజ్‌మెంట్ పంపుతూ వారం వారం అధిక ఆదాయం పొందండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95738 33520, 90596 33520.

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. ఫోన్ : 9640258889, 9640468889

■ రేమండ్ షోరూమ్, జడ్చర్ల, నాగర్‌కర్నూల్ వనపర్తి లో పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్ స్టోర్ ఇంఛార్జ్, సేల్స్ ఇంఛార్జ్ కావలెను. సెల్: 9492801999, 08543796686.


■ షిర్డిసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్ లో పని చేయుటకు లేడీ వార్డెన్స్, ఆయాలు, వార్డ్‌బాయ్స్, భార్యాభర్తలు కావలెను. ఫోన్ : 9391036831, 9246585901

■ మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ఫార్మా కంపెనీలో సెక్యూరిటీ గార్డులు కావలెను. జీతం: 13,000/- ESI, PF కలదు. భోజనం మరియు ఉచిత వసతి. Ph: 6300661014



గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి మేనేజ్‌మెంట్

సాక్షి భవిత విద్యార్థుల కోసం



మూన్ గురించి.. మీకు తెలుసా?

➤ మనం అనుకున్నట్లు.. చంద మామ గుండ్రంగా ఉండడు.. గుడ్డు ఆకారంలో ఉంటాడు.. అలాగే చల్లనయ్య.. తెల్లనయ్య కాదు.. దగ్గర్నుంచి చూస్తే.. ముదురు బూడిద రంగులో ఉంటాడు. మనం ఎప్పుడు చూసినా.. చంద్రునిలోని 59 శాతం మాత్రమే మనకు కనిపిస్తుందట. అంతేకాదు.. చంద్రుడిని దగ్గర నుంచి చూస్తే.. భారీ గుంతలులాంటివి కనిపిస్తుంటాయి. ఇవన్నీ.. కొన్ని కోట్ల ఏళ్ల క్రితం ఖగోళ వస్తువులు దాన్ని ఢీకొన్నప్పుడు ఏర్పడినవే..

ఆన్‌లైన్‌లో 'అగ్రి' సెన్సెస్

- రెవెన్యూ గ్రామం యూనిట్‌గా వ్యవసాయ గణన షురూ
- ఇతర రాష్ట్రాల్లో మాన్యువల్‌గానే...
- మన దగ్గరే యాప్ ద్వారా స్మార్ట్ ఫోన్లు, ట్యాబ్‌ల వినియోగం

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రైతుల జీవన స్థితి గతులు..సాగు కమతాల స్వరూప స్వభావాన్ని తేల్చే వ్యవసాయగణన (అగ్రికల్చర్ సెన్సెస్) ఇటీవల దేశవ్యాప్తంగా మొదలైంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం తెలంగాణలో కూడా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. భూకమతాల వారీగా రెవెన్యూ గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని సర్వే నిర్వహిస్తున్నారు. మొత్తం పది అంశాలపై మూడు దశల్లో వివరాలు సేకరిస్తున్నారు. రాష్ట్రంలో తొలిసారిగా కాగిత రహితంగా స్మార్ట్ ఫోన్లు, ట్యాబ్‌లు వినియోగించి ప్రత్యేక యాప్ ద్వారా డిజిటల్ విధానంలో ఏఈఓలు సర్వే చేస్తుండగా, మిగతా రాష్ట్రాల్లో మాన్యువల్‌గానే చేపడుతున్నారు.

2021–22 ప్రామాణికంగా 11వసారి

దేశంలో వ్యవసాయ స్థితిగతులు తెలుసుకోవడంతో పాటు అభివృద్ధి ప్రణాళిక, సామాజిక ఆర్థిక విధాన రూపకల్పనకు కేంద్రం ఐదేళ్లకు ఒకసారి వ్యవసాయ గణన నిర్వహిస్తోంది. 1979లో వ్యవసాయగణన మొదలుకాగా, చివరగా పదోసారి 2015–16లో చేపట్టారు. 11వ వ్యవసాయ గణన 2021–22లో జరగాల్సి ఉండగా, కరోనా తదితర కారణాలతో వాయిదా పడుతూ వస్తోంది. 2021–22 ప్రామాణిక సంవత్సరంగా ఈ నెల నుంచి వ్యవసాయానికి సంబంధించిన పూర్తి వివరాలు సేకరించేందుకు ప్రభుత్వం కొద్దిరోజుల క్రితమే ఆదేశాలు జారీ చేసింది.



మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం మద్దిగట్లంలో సర్వే చేస్తున్న ఏఈఓ

మూడు దశల్లో...

వానాకాలం, యాసంగిలో ఆయా రైతుల వారీగా ఏ ఏ పంటలు సాగు చేస్తున్నారో తెలుసుకునేందుకు రాష్ట్రంలో ఏటా వ్యవసాయశాఖ సర్వే చేస్తోంది. అయితే కేంద్రం మార్గదర్శకాల ప్రకారం మూడు విడతల్లో వ్యవసాయ గణన చేపట్టారు.

- మొదటి విడతలో రైతు పేరు, సామాజికస్థితి, సాగు విస్తీర్ణం, భూమి వినియోగం, పురుషులు, మహిళలు ఇలా అన్ని సేకరించి రెవెన్యూ గ్రామం వారీగా నమోదు చేస్తున్నారు.
- రెండో విడతలో ఎంపిక చేసిన 20 శాతం గ్రామాల్లో ప్రణాళిక శాఖ నిర్దేశించిన టీఆర్ఏఎస్ (టైమ్ లీ రిపోర్టెడ్ అగ్రి స్టాటిస్టిక్స్)తో పాటు అదనంగా మరికొంత సమాచారం సేకరిస్తారు.
- మూడో దశలో ఏడు శాతం గ్రామాల్లో సాగు ఖర్చులు, యంత్రాల వినియోగం, ఎరువులు, విత్తనాలు, ప్రభుత్వ రాయితీలు తదితర వివరాలు సేకరిస్తారు.

సాంకేతికతతో సర్వే...

తాజాగా రాష్ట్రంలో చేపట్టిన వ్యవసాయ గణనలో అధికారులు వందశాతం సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటున్నారు. స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్‌ల ద్వారా డిజిటల్ విధానంలో వ్యవసాయ కమతాలు, రైతుల వివరాలు సేకరిస్తున్నారు. ఇప్పటికే రైతుబంధు పథకానికి రైతుల నుంచి ఆధార్ కార్డులు, వ్యవసాయ భూముల విస్తీర్ణం, పంటల సాగు తదితర వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచగా, వాటి ఆధారంగా వ్యవసాయగణనలో అదనపు సమాచారం తీసుకుంటున్నారు.

ప్రణాళికకు వ్యవసాయ గణన కీలకం



వ్యవసాయ స్థితిగతులు తెలుసుకోవడంతో పాటు ఆర్థిక విధాన రూపకల్పనకు వ్యవసాయ గణన ఎంతో ఉపయోగకరం. నిర్ణీత లక్ష్యం మేరకు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం. జిల్లావ్యాప్తంగా వ్యవసాయశాఖ, ప్రణాళిక శాఖ అధికారులు, సిబ్బంది సర్వే నిర్వహిస్తున్నారు.

– దశరథ్, మహబూబ్‌నగర్ జిల్లా ప్రణాళికశాఖ అధికారి

ఈ నెల 31లోగా పూర్తి చేస్తాం



ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో వ్యవసాయ గణన చేయిస్తున్నాం. దీని వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న పథకాలకు అనుగుణంగా ఈ పంటల వివరాల లెక్కల సేకరణ జరుగుతోంది. ఈ నెలాఖరులోపు సర్వే పూర్తి చేస్తాం.

– బి.వెంకటేష్, మహబూబ్‌నగర్ జిల్లా వ్యవసాయ అధికారి

ప్రముఖ గణిత శాస్త్రవేత్త డాక్టర్ సీఆర్ రావు కన్నుమూత

- అనారోగ్యంతో అమెరికాలో తుదిశ్వాస
- గణిత శాస్త్రంలో నోబెల్‌కు సమానమైన అవార్డును అందుకున్న సీఆర్ రావు
- పద్మభూషణ్, పద్మవిభూషణ్‌తో సత్కరించిన భారత ప్రభుత్వం



ఏయూ క్యాంపస్/డాబాగార్డెన్స్: ప్రపంచ ప్రఖ్యాత గణాంక, గణిత శాస్త్రవేత్త డాక్టర్ సీఆర్ రావు (102) కన్నుమూశారు. అమెరికాలో ఉన్న ఆయన అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. 1920 సెప్టెంబర్ 10న కర్ణాటకలోని బళ్లారి జిల్లా హడగళిలో కల్యంపూడి రాధాకృష్ణా రావు (సీఆర్ రావు) తెలుగు కుటుంబంలో జన్మించారు. తర్వాత ఏపీలోని గూడూరు, నూజివీడు, నందిగామల్లో ఆయన బాల్యం గడిచింది. విశాఖలోని ఏవీఎన్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశారు. 1940లో ఏయూలో గణిత శాస్త్రం అభ్యసించారు. అనంతరం యూనివర్సిటీ ఆఫ్ కోల్‌కతాలో ఎంఏ స్టాటస్టిక్స్ చేశారు. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలోని కింగ్స్ కాలేజీలో 1948లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఇండియన్ స్టాటస్టికల్ ఇన్‌స్టిట్యూట్‌లో విద్యార్థిగా చేరి అదే సంస్థకు డైరెక్టర్‌గా ఎదిగారు. అక్కడ పదవీ విరమణ చేసిన అనంతరం అమెరికాలో స్థిరపడి అక్కడ యూనివర్సిటీ ఆఫ్ బఫెలోలో రీసెర్చ్ ప్రొఫెసర్‌గా సేవలందించారు. ఆయన 19 దేశాల నుంచి 39 డాక్టరేట్లు అందుకున్నారు. 477 పరిశోధన పత్రాలను సమర్పించారు. 15 పుస్తకాలు రాశారు. 2002లో అప్పటి అమెరికా అధ్యక్షుడు జార్జిబుష్ చేతుల మీదుగా ఆ దేశ అత్యున్నత నేషనల్ మెడల్ ఆఫ్ సైన్స్ పురస్కారాన్ని అందుకున్నారు. యూకే ఇంటర్నేషనల్ స్టాటస్టికల్ ఇన్‌స్టిట్యూట్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యాథమెటికల్ సైన్స్, ఇంటర్నేషనల్ బయోమెట్రిక్ సొసైటీకి అధ్యక్షుడిగా పనిచేశారు. భారత స్టాటస్టిక్స్ రంగానికి ఆయన చేసిన సేవలకు గాను కేంద్ర ప్రభుత్వం ఆయనను 1968లో పద్మభూషణ్, 2001లో పద్మవిభూషణ్‌తో సత్కరించింది. ఎస్ఎస్ భట్నాగర్ పురస్కారాన్ని కూడా సీఆర్ రావు అందుకున్నారు. ఆయన 2020 సెప్టెంబర్ 10న 100వ పుట్టినరోజును జరుపుకున్నారు.

స్టాటస్టిక్స్‌లో నోబెల్ అంతటి గౌరవం

సీఆర్ రావుకు 75 ఏళ్ల కిందట గణాంక రంగంలో విప్లవాత్మకమైన ఆలోచనలకు బీజం వేసినందుకు గాను ఆ రంగంలో నోబెల్ బహుమతికి సమానమైన ఇంటర్నేషనల్ ప్రైజ్ ఆఫ్ స్టాటస్టిక్స్–2023 అవార్డును అందజేశారు. 102 ఏళ్ల వయసులో ఈ ఏడాదే ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. 1945లో కోల్‌కతా మ్యాథమెటికల్ సొసైటీలో ప్రచురితమైన సీఆర్ రావు పరిశోధన పత్రానికి ఈ అవార్డు దక్కింది. ఆయన చేసిన కృషి..ఇప్పటికీ సైన్స్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపుతూ ఉందని ఇంటర్నేషనల్ ప్రైజ్ ఇన్ స్టాటస్టిక్ ఫౌండేషన్ తెలిపింది.

ఎన్టీపీసీ రెండోయూనిట్‌లో ఉత్పత్తి ప్రారంభం

100 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేసిన యూనిట్



జ్యోతినగర్ (కరీంనగర్): ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టుతో రాష్ట్రానికి మరిన్ని వెలుగులు ప్రసరించనున్నాయి. రాష్ట్ర ఆవిర్భావం అనంతరం ప్రాజెక్ట్‌లోని 800 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేసే రెండోయూనిట్ బుధవారం ప్రారంభమైంది. ఈ మేరకు ప్రాజెక్టు చీఫ్ జనరల్ మేనేజర్ కేదార్ రంజన్ పాండు, జనరల్ మేనేజర్లు అతుల్ కమలాకర్ దేశాయ్, అనుపమ్ ముఖర్జీ, మోహన్‌రెడ్డి, సంతోశ్ తివారీ, అర్పన్‌దాస్ గుప్తా, సీనియర్ అధికారులు ఓ ప్రకటనలో వెల్లడించారు. రెండో యూనిట్ సింక్రనైజేషన్ విజయవంతంగా పూర్తికావడంతో వీరంతా అభినందనలు తెలుపుకున్నారు. కాగా, ప్రారంభమైన విద్యుదుత్పత్తి రెండో యూనిట్ తొలిరోజే 100 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసింది.

మార్చిలో తొలి యూనిట్ సింక్రనైజేషన్: తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు స్టేజీ–1లోని 800 మెగావాట్ల మొదటి యూనిట్‌ను ఈ ఏడాది మార్చి 24న సింక్రనైజేషన్ చేశారు. మొదటగా 104.9 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి దశలోకి తీసుకొచ్చారు. జూలై 23న పూర్తిస్థాయిలో 801.2 మెగావాట్ల ఉత్పత్తికి చేరుకుంది. 72 గంటల నిరంతర విద్యుదుత్పత్తి అనంతరం గ్రిడ్‌కు అనుసంధానం చేసే ప్రక్రియను ప్రారంభించారు. ఈ నెల 27 నుంచి గ్రిడ్‌కు అనుసంధానం చేసేలా ట్రాన్స్‌కోలోని లోడ్ డిస్పాచ్ సెంటర్(ఎల్డీసీ) నుంచి స్లాట్లను పొందింది.

మహిళా రిజర్వేషన్లు నా ఇంటి సమస్య కాదు

మహిళా హక్కులపై 'కాంగ్రెస్' బీజేపీది ఒకే వైఖరి: కవిత



సాక్షి, హైదరాబాద్: మహిళా రిజర్వేషన్ల అంశం తన ఇంటి సమస్య కాదని.. ఇది దేశ మహిళలకు సంబంధించినదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. మహిళా బిల్లు కోసం జంతర్‌మంతర్ వద్ద తాను ధర్నా చేసినప్పుడు కలిసిరాని పార్టీలు, నాయకులు ఇప్పుడు స్పందించడం మహిళా బిల్లు ప్రాధాన్యతను తెలియజేస్తోందని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో కవిత మీడియాతో మాట్లాడారు. చట్టం ద్వారానే చట్టసభల్లో మహిళల ప్రాతినిథ్యం పెరుగుతుందని, అయితే మహిళల హక్కులపై కాంగ్రెస్, బీజేపీ దొందూదొందే అన్న రీతిలో వ్యవహరిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ 2014 వరకు అధికారంలో ఉన్నా లోక్‌భలో ఎందుకు ఆమోదించలేదని ప్రశ్నించారు. పదేళ్లుగా మహిళాబిల్లుపై ప్రధాని మోదీని కాంగ్రెస్ నేతలు సోనియా, ప్రియాంక ఎందుకు నిలదీయలేదన్నారు. ఈ ఏడాది డిసెంబర్‌లో మరోమారు తాను ఢిల్లీ జంతర్‌మంతర్‌లో చేసే ధర్నాకు సోనియా, ప్రియాంకతోపాటు కేంద్రమంత్రి స్మృతి ఇరానీని కూడా ఆహ్వానిస్తానని ప్రకటించారు.

70 కోట్ల మంది మహిళల భవిష్యత్ ప్రశ్నార్థకం

మహిళాబిల్లు ఆమోదం పొందకపోవడంతో దేశంలోని 70 కోట్ల మంది మహిళల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా హక్కులపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చాలా అవహేళనగా మాట్లాడారని కవి త ఆగ్రహం వ్యక్తం చేశారు.



సమావేశంలో రాకేశ్ శర్మ, కేఆర్‌పీ రెడ్డి, హర్మస్జి కామ, మేరీ పాల్

హైదరాబాద్‌లో ఐఎన్ఎస్ సమావేశం

సాక్షి, హైదరాబాద్: భారత పత్రికల సమాఖ్య (ఐఎన్ఎస్) సదస్సు పదిహేనేళ్ల తర్వాత హైదరాబాద్‌లో సమాఖ్య అధ్యక్షుడు కేఆర్‌పీ రెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగింది. పత్రిక పరిశ్రమకు ఐఎన్ఎస్ అపెక్స్ కో ఆర్డినేషన్ సంస్థగా పనిచేస్తూ.. పరిశ్రమకు సంబంధించిన పలు అంశాలను చర్చించి, వాటిని పరిష్కరించడం, అవసరమైన వాటిని ప్రభుత్వ విభాగాల దృష్టికి తీసుకొని వెళ్తుంది. బుధవారం జరిగిన సదస్సులో కేఆర్‌పీ రెడ్డి, ఉపాధ్యక్షుడు రాకేశ్‌శర్మ, సెక్రెటరీ జనరల్ మేరీ పాల్, అడ్వర్టైజ్‌మెంట్ కమిటీ చైర్మన్ హర్మస్జి కామ, రీజినల్ అడ్వర్టైజ్‌మెంట్ కమిటీ చైర్మన్ స్థానిక అక్రెడిటెడ్ అడ్వర్టైజ్‌మెంట్ ఏజెన్సీలు, స్థానిక ఐఎన్ఎస్ పబ్లికేషన్‌తో సంప్రదింపులు జరిపి వారి నుంచి పలు అంశాలపై సమాచారం సేకరించారు. జీఎస్టీ, వాణిజ్య, ప్రభుత్వాల నుంచి రావాల్సిన ప్రకటనల చెల్లింపులు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించి కొన్నింటికి పరిష్కారాలు కనుగొన్నట్లు కేఆర్‌పీ రెడ్డి తెలిపారు.

హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలకు స్థల పరిశీలన

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సోమశిలకు వెళ్లే ప్రధాన రహదారి సమీపంలో ఉన్న 60 ఎకరాల ప్రభుత్వ భూమిని బుధవారం హార్టికల్చర్ యూనివర్సిటీ వీసీ నీరజ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గంలో హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేసినందుకు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం 15 కృషి విజ్ఞాన కేంద్రాలు, 4 పాలిటెక్నిక్ కళాశాలలు మంజూరు చేసిందన్నారు. హార్టికల్చర్ పాలిటెక్నిక్ కోర్సులో చేరే విద్యార్థులు చదవడానికి రెండు సంవత్సరాల కోర్సు ఉంటుందని తెలిపారు. పట్టణంలోని ఆర్‌ఐడీ పాఠశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తులు తీసుకుంటున్నామని, ఆసక్తి ఉన్న విద్యార్థులు పదో తరగతి పాసై ఉండాలన్నారు. అవకాశాన్ని ఈ ప్రాంత వాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్టేట్ అధికారి నాగేశ్వర్ రెడ్డి, డీఈ కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

సెప్టెంబర్ 6న బహిరంగ వేలం

చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపురం కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలు ఏటా కార్తీకకార్తిక మాసంలో అంగరంగ వైభవంగా కొనసాగుతాయి. ఈ ఏడాది ఉత్సవాల్లో టెంకాయలు, లడ్డూ ప్రసాదం, తలనీలాలు, టెంకాయ చిప్పలు, పూజా సామాగ్రి విక్రయం, విద్యుత్ సౌకర్యం కల్పనకు సెప్టెంబర్ 6న ఆలయ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓ మదనేశ్వర్‌రెడ్డి బుధవారం తెలిపారు.

ప్రభుత్వ భూమికి ఎసరు

- ప్లాట్లు చేసి విక్రయించేందుకు ఓ ప్రజాప్రతినిధి యత్నం
- అడ్వాన్సులు కూడా వసూలు చేసిన వైనం

రాజోళి: ప్రభుత్వ భూములు, స్థలాలు కాపాడాల్సిన ఓ బాధ్యత గల ప్రజాప్రతినిధి తానే బకాసురుడి అవతారమెత్తి ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిని కాజేసేందుకు కన్నేశాడు. ఏకంగా 22ఎకరాల ప్రభుత్వ భూమిలో రెండు ఎకరాల మేర ప్లాట్లు వేసి విక్రయించేందుకు సర్వం సిద్ధం చేశాడు. కొందరు అమాయకులు అందులో ప్లాట్ల కోసం అడ్వాన్సులు కూడా ముట్టజెప్పడం గమనార్హం.

22 ఎకరాల భూమిలో..

మండలంలోని పచ్చర్ల గ్రామంలో సర్వే నెంబర్ 9లో 22 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అందులో కొంత దళితుల అసైన్డ్ భూమి కూడా ఉంది. గత కొన్నేళ్లుగా ఆ భూమి బీడుగా ఉండి, కంప చెట్లు ఉండటం, బహిర్భూమికి వెళ్లేందుకు కొందరు, మరి కొంత భూమిలో కందకాలు, కల్లాలుగా రైతులు వాడుకునే వారు. అయితే గ్రామంలో ఎప్పటి నుండో అలాగే ఉన్న భూములను తనకు చెందినవిగా స్థానికులను నమ్మించే ప్రయత్నం చేయడంలో ఆ ప్రజాప్రతినిధి సఫలం అయ్యారు. దాన్ని అడ్డు పెట్టుకుని గ్రామంలోని సదరు భూమిలో తొలి విడతలో భాగంగా రెండు ఎకరాలను విక్రయానికి పెట్టాడు. ఆ భూమిలో ప్లాట్లు వేసి అమ్మితే మంచి లాభాలు వస్తాయని ఇతరులకు నమ్మబలకడంతో, ఇతర ప్రాంతం నుంచి వచ్చిన వారు దాన్ని కొనుగోలు చేసేందుకు సిద్ధమయ్యారు. కానీ భూమికి సంబంధించిన రికార్డులు అడగటంతో అవి ఇవ్వలేని కారణంతో వారు కొనలేమని చెప్పారు. అయినా తన ప్రయత్నాలు విరమించకుండా తానే స్వయంగా ప్లాట్లు వేయాలని నిర్ణయించుకున్నాడు. ఏకంగా రెండు ఎకరాల మేర కంప చెట్లను, వ్యర్థాలను తొలగించి భూమిని చదును చేసి ప్లాట్లు అమ్మేందుకు సిద్ధం చేశాడు. మరికొన్ని హంగులు చూపేందుకు ఇసుక, కంకర, తదిదర మెటీరియల్‌ను అక్కడ పోయడంతో, ఆ భూమిపై తనకు హక్కులున్నాయని నమ్మించాడు. దీంతో గ్రామంలోని కొందరు ప్లాట్లు కొంటామని చెప్పగా, ఒక్క ప్లాటు రూ.50 వేల చొప్పున అమ్మేందుకు సిద్ధం చేసి స్థానికులు కొందరి నుంచి అడ్వాన్సులు కూడా వసూలు చేశాడు. సర్వే నెంబర్ 9లో దళితులకు లావని పట్టా ద్వారా సంక్రమించిన భూములన్నాయని తెలిసిన కొందరు యువకులు వాటి గురుంచి ఆరా తీస్తే అసలు విషయం బయటకు వచ్చినట్లు 'సాక్షి'కి తెలిపారు. దీంతో సదరు ప్రజాప్రతినిధి విషయం బయటకు రానివ్వకుండా జాగ్రత్త పడేందుకు చర్యలు ప్రారంభించారు. అధికారులను కూడా ప్రసన్నం చేసుకునేందుకు ప్రయతిస్తున్నాడని తెలిసింది.



పచ్చర్ల గ్రామంలోని సర్వే నంబర్ 9లోని ప్రభుత్వ స్థలం, నిల్వ చేసిన ఇసుక, కంకర

తహసీల్దార్ ఏమన్నారంటే..

ఈ విషయాన్ని తహసీల్దార్ జోసి శ్రీనివాస్‌శర్మతో 'సాక్షి' ప్రస్తావించగా.. ఆ విషయం తమ దృష్టికి కూడా వచ్చిందని, దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేపడుతున్నామన్నారు. సర్వేయర్, ఆర్ఐ తమ సిబ్బందితో కలిసి ఆ భూమిలో సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. ఆ భూమిలో వేసిన ఇసుక, కంకర, మెటీరియల్‌ను కూడా తీసేయాలని ఆదేశించినట్లు ఆయన తెలిపారు.

పెరిగిన ఉల్లి ధరలు

- గరిష్టంగా రూ.2,300
- కనిష్టంగా రూ.1,600

దేవరకద్ర: దేవరకద్ర మార్కెట్‌లో బుధవారం జరిగిన వేలంలో ఉల్లి ధరలు మరోసారి పెరిగాయి. మూడు వారాల నుంచి ఉల్లి ధరలు పుంజుకున్నాయి. బుధవారం మార్కెట్ యార్డులో జరిగిన వేలంలో స్థానిక వ్యాపారులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు పాల్గొన్నారు. నాణ్యమైన ఉల్లి ధర క్వింటాల్ గరిష్టంగా రూ.2,300, కనిష్టంగా రూ.1,600 వరకు పలికాయి. ఇక రెండో రకం, చిన్న సైజు ఉల్లి క్వింటాల్ ధర గరిష్టంగా రూ.1,500, కనిష్టంగా రూ.1,000 వరకు ధరలు వచ్చాయి. రెండు వారాల కిందట జరిగిన వేలంలో వచ్చిన ధరల కన్నా.. దాదాపు పది శాతం ధరలు పెరిగాయి. ప్రస్తుతం మార్కెట్‌కు వస్తున్న ఉల్లి యాసంగి సీజన్‌లో పండించింది. గతంలో ధరలు లేకపోవడంతో చాలా మంది రైతులు అమ్మకుండా నిల్వ చేసుకుని ఇప్పుడు మార్కెట్‌కు అమ్మకానికి తీసుకొచ్చారు. ప్రస్తుతం ధరలు పెరగడంతో నిల్వ చేసుకున్నందుకు కొంత లాభాలు పొందుతున్నట్లు రైతులు వెల్లడించారు. నిల్వ చేసిన ఉల్లిలో ప్రతివారం ధరలు బేరీజు వేసుకుని పది నుంచి ఇరవై క్వింటాళ్ల ఉల్లిని తెస్తున్నట్లు రైతులు తెలిపారు.



దేవరకద్ర మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన ఉల్లి

జోరుగా వ్యాపారం...

దేవరకద్ర మార్కెట్‌లో ఉల్లి వ్యాపారం జోరుగా సాగింది. వేలంలో కొనుగోలు చేసిన ఉల్లిని 45 కిలోల బస్తాలుగా తూకం వేసి అమ్మకాలు సాగించారు. బస్తా ధర గరిష్టంగా రూ.1,200 పలుకగా కనిష్టంగా రూ.800 వరకు పలికింది. రెండో రకం, చిన్న సైజు ఉల్లి బస్తా ధర రూ.750 నుంచి రూ.500 వరకు విక్రయించారు. చిరు వ్యాపారులతో పాటు వినియోగదారులు బస్తాలుగా ఉల్లిని కొనుగోలు చేశారు. దేవరకద్రలో బుధవారం జరిగిన సంతలో కిలో ధర రూ.30 వరకు విక్రయించారు.

జూరాలకు స్వల్పంగా పెరిగిన ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. మంగళవారం సాయంత్రం ప్రాజెక్టుకు వెయ్యి క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, బుధవారం సాయంత్రానికి ప్రాజెక్టుకు 3వేల క్యూసెక్కులకు పెరిగింది. మండలంలోని నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో ఒక పంపు ద్వారా 750 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఆవిరి రూపంలో 110, భీమా లిఫ్టు –1 ద్వారా 650, కోయిల్‌సాగర్‌కు 315, జూరాల ఎడమ కాల్వ ద్వారా 1,030, కుడి కాల్వకు 685, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 100 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 7.682 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



రామన్‌పాడులో ప్రస్తుత నీటిమట్టం

రామన్‌పాడులో 1,020 అడుగులు..

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో బుధవారం నాటికి ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం 1,020 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 1,030 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా, సమాంతర కాల్వ నీటిని నిలిపివేశారు. ఎన్టీఆర్ కాల్వ ద్వారా వ్యవసాయ అవసరాల కోసం 950 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వల ద్వారా 20 క్యూసెక్కుల నీటిని, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

శ్రీశైలంలో 857.1 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో బుధవారం 857.1 అడుగుల నీటిమట్టం, 97.6 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 7,625, ముచ్చుమర్రి నుంచి కేసీ కెనాల్‌కు 490, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 2,025, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 1,389 క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భ కేంద్రంలో 4.066 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి 9,782 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదిలారు.

నీళ్లు ఇవ్వలేదని నిలిచిన అద్దె బస్సులు

- నిరసన తెలిపిన యజమానులు, సిబ్బంది
- ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రయాణికులు
- ఇతర డిపోల నుంచి బస్సులు తెప్పించిన అధికారులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో బుధవారం ఉదయం 5 గంటల నుంచి మహబూబ్‌నగర్ డిపోకు చెందిన హైర్ (అద్దె) బస్సులను యజమానులు నిలిపివేశారు. బస్సులను శుభ్రం చేసుకునేందుకు రెండు బకెట్లు నీళ్లు అడిగితే ఇవ్వడం లేదని మండిపడ్డారు. డిపోలో 130 ఆర్టీసీ బస్సులకు గాను 70 అద్దె బస్సులు ఉన్నాయి. ఈ బస్సులన్ని నిలిచిన విషయం తెలియని ప్రయాణికులు, ఉద్యోగులు ఇబ్బందులు బస్సులో వెళ్లి కూర్చున్నారు. బస్సులు కదలకపోవడంతో డిపోలోకి వెళ్లి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా హైదరాబాద్, నవాబ్‌పేట, తాండూర్, కొత్తకోట, నారాయణపేట, మద్దూర్‌తో పాటు ఇతర రూట్లలో ప్రయాణికులకు బస్సులు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు.

ప్రత్యామ్నాయ చర్యలు..

అద్దె బస్సులు ఆగిపోవడంతో డిపో అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. రీజియన్‌లోని నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, వనపర్తి, గద్వాల, షాద్‌నగర్ డిపోల నుంచి బస్సులను తెప్పించి ఆయా రూట్లలో నడిపించారు. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా బస్సులను ఏర్పాటు చేశారు.



బస్టాండ్ ఆవరణలో నిలిచిపోయిన ఆర్టీసీ అద్దె బస్సులు, అద్దె బస్సుల యజమానులు, డ్రైవర్లు

నిరసన తెలిపిన యజమానులు, డ్రైవర్లు..

బస్టాండ్ ఆవరణలో నిలిచిన హైర్ బస్సుల వద్ద అద్దె బస్సుల యజమానులు, డ్రైవర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు యజమానులు మాట్లాడారు. బస్సులను శుభ్రం చేసుకోవడానికి రెండు బకెట్ల నీళ్లు ఇవ్వాలని అడిగామని, అధికారులు ఇవ్వడం లేదని వాపోయారు. బస్సులకు నీళ్లు ఇవ్వాలని కోరుతూ ఇటీవలే అధికారులకు కూడా వినతి అందజేసినట్లు చెప్పారు. కండక్టర్లు అద్దె బస్సులను ఎక్కడంటే అక్కడ ఆపాలంటూ డ్రైవర్లపై ఒత్తిడి తీసుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్టాప్ వద్ద బస్సులు ఆపుతామని, ఇరుకు రోడ్లలో, ఇతర చోట్ల బస్సులు ఆపితే పోలీస్ చలాన్లు పడుతున్నాయని తెలిపారు. అధికారులు స్పందించి అద్దె బస్సులను శుభ్రం చేసుకోవడానికి నీళ్లు ఇవ్వాలని కోరారు. నిరసన తెలిపిన వారిలో ఆర్టీసీ అద్దె బస్సు యజమానుల సంఘం సభ్యులు రాజేశ్వర్‌రెడ్డి, నర్సింహులు, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం...

బస్సులను నడపాలని అద్దె బస్సుల యజమానులకు విజ్ఞప్తి చేశాం. ఆర్టీసీ అద్దె బస్సులు ఆపిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇతర డిపోల నుంచి బస్సులు తెప్పించి నడిపిస్తున్నాం.

– సుజాత, డిపో మేనేజర్, మహబూబ్‌నగర్